క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను అందజేసిన కౌన్సిలర్ వీరభద్రరావు

సామర్లకోట: పేదలకు రూ.25 లక్షల వరకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించే ఆరోగ్య శ్రీ కార్డులను స్థానిక 14వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ మేరకు ఈకెవైసీ చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సామర్లకోట: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె శనివారం నాలుగో రోజు కొనసాగింది. వారికి సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బొడకొండ, పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్ల సత్య నారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

వంతెనపై నిలచిన లారీ



లారీని పక్కన పెడుతున్న పొక్లెయిన్

సామర్లకోట: కాకినాడ రోడ్డులో స్థానిక ఐదు తూముల వంతెనపై లారీ నిలిచి పోయింది. దాంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో సాంకేతిక లోపం తో కాకినాడ నుంచి వస్తూ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు శనివారం ఉదయం క్రేన్ సాయంతో పక్కన ఉన్న ఖాళీ ప్రదేశానికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీ డ్రైవర్ పరారు కావడంతో అతనిపై కేసు నమోదు చేయనున్నట్టు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

ఘనంగా గరగ ఉత్సవం

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి గరగ ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మకర సంక్రాంతి సందర్భంగా అమ్మవారిని సంప్రదాయబద్ధంగా సామర్లకోట పుట్టింటికి తీసుకువెళ్లి వచ్చేందుకు ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో గరగలను తీశారు. ఆలయం వద్ద గరగల నాట్యం అనంతరం అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వి రామ్మోహనరావు ఆధ్వర్యంలో గరగ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

పెద్దాపురం: రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని కాపాడి గ్రామాల్లో కూలీల వలసలను అరికట్టాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు దళిత పేటలో శనివారం గ్రామ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వల్లూరి రాజుబాబు, కుంచే అంజిబాబు, మునిలిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... కొత్తపల్లి ఎస్సీ పేటలోని ఓ పాన్ షాపులో రాజాల రాంబాబు మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. రాంబాబును అరెస్టు చేసి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భగవద్గీతపై ఇంటింటా ప్రచారం



ఫక్రుద్దీన్ పాలెంలో భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞానవేదిక ప్రతినిధులు

పిఠాపురం: మండలంలోని ఫక్రుద్దీన్‌పాలెంలో త్రైత సిద్ధాంత ప్రబోధన సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం త్రైత సిద్ధాంత భవవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ రచించిన ఆధ్యాత్మిత త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధన సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక వేదిక రాజమంహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, ఆదిబాబు, సోమినాయుడు, సత్యవతి, సరిత, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాధికార ఉత్సాహం

- బస్సు యాత్రతో శ్రేణుల్లో ఆనందం
- దవులూరి పిలుపుతో తరలివచ్చిన ప్రజలు
- జనసంద్రమైన పెద్దాపురం



పెద్దాపురం సాధికార బస్సు యాత్రలో పాల్గొన్న ఎంపీ గీత, కో ఆర్డినేటర్ దవులూరి తదితరులు



సాధికార యాత్రకు తరలివచ్చిన జన సందోహం

సామర్లకోట: అతి తక్కువ సమయంలో సాధికార బస్సు యాత్ర విజయవంతం అయింది. కేవలం రెండు రోజుల వ్యవధిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపు మేరకు వేలాదిగా యాత్రకు జనం తరలివచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం వెల్లువెత్తింది. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా సాధికార యాత్రకు తరలివచ్చారు. పెద్దాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పాదయాత్రగా మున్సిపల్ సెంటర్‌లోని విక్టరీ బజార్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సాయంత్రం 4.10 నిమిషాలకు బహిరంగ సభ ప్రారంభించారు. దాంతో పెద్దాపురం జనంతో నిండిపోయింది. వేదికపై నాయకులు ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న సమయంలో ప్రజలు హర్షధ్వానా చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఏ విధమైన సామాజిక న్యాయం చేశారో తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే 14 సంవత్సరాలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసి చేసిన మోసాలను బీసీ, ఎస్సీ నాయకులు వివరిస్తారని చెప్పారు. బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే ఆశయాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రాంతంలోను బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీలు వేరువేరుగా ఉంటాయని, అయితే జగన్‌మోహన్‌రెడ్డి అందరూ ఒకేచోట ఉండాలని జగనన్న కాలనీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. అటువంటి పథకాలపై అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం వింతగా ఉన్నదన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు.

పెద్దాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సీఎం జగన్ తనకు అవకాశం కల్పించారని తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎస్సీ సెల్ చైర్మన్, ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, కాకినాడ స్మార్ట్ సిటీ చైర్మన్ అల్లి రాజబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీ నారాయణ, కంటే వీర్రాఘవరావు, మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యులు ఎలిశెట్టి అమృత నరేష్, గవరసాని సూరిబాబు, రెండు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



వీకే రాయపురం నుంచి తరలి వచ్చిన అభిమానులు

ఆలయ అభివృద్ధికి కృషి

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- తొలి తిరుపతి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న దొరబాబు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సుమారు కోటిన్నర రూపాయల నిధులతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులను శనివారం ఆయన జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళితో కలిసి ఐదు అంతస్తుల రాజగోపురం, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ కర్రి వెంకట రామ జగదీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని వసతులు కల్పిస్తూ శృంగార వల్లభుడి ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడమే గాక ఆధ్యాత్మికత పెంచేలా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ క్యూలైన్లు, ప్రసాద వితరణ, అన్నదానం వంటి అన్ని చోట్ల నూతన హంగులతో ఆలయ అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టామని, రాజగోపురం నిర్మాణం, ఆన్‌లైన్ టిక్కెట్లు విక్రయ కేంద్రాన్ని దొరబాబు చేతుల మీదుగా ప్రారంభించినట్టు తెలిపారు. తొలుత ఆలయ మర్యాదలతో పండితులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఒబిలిశెట్టి కాశీ, కుంచే అమరావతి, నరాలశెట్టి త్రినాథ్, లక్కాకుల నానాజీ, తుమ్మల అచ్యుత రామయ్య, ఆలయ కమిటీ సభ్యులు అడబాల జగ్గారావు, రాకుర్తి కుమారి, కుంచే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

- కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో కొత్త పింఛన్ల పంపిణీ



గొల్లప్రోలు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలోని ఆర్యవైశ్య కల్యాణ మండలంలో శనివారం నగరపంచాయతీ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంతో తనకు 25 సంవత్సరాల అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో 2 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించి తనకు ప్రజా సేవ చేసే అవకాశం ఇచ్చారన్నారు. గత 18 నెలలుగా గడపగడపకూ మన ప్రభుత్వం పేరుతో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించామన్నారు. తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు మొగిలి బాబ్జీ, అరిగెల రామయ్యదొర, మొగిలి అయ్యారావు, జ్యోతుల భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అధికారుల పాత్ర కీలకం

ఆర్డీవో జేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో సెక్టోరియల్, ఏఈఆర్‌ఓల పాత్ర కీలకమైనదని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల సెక్టార్, జోనల్, రూట్ ఆఫీసర్లు, వీఆర్‌ఓలతో ఆయన సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై అధికారులు మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దష్టి కనపర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్, మున్సిపల్ మేనేజర్ జ్యోతితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమర్థంగా ఇంటింటికీ రేషన్



పెద్దాపురంలో రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించనున్నట్టు ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. పట్టణంలో డీఎంయూ వాహనాల ద్వారా సరఫరా అవుతున్న రేషన్ పంపిణీని శనివారం ఆయన తహసీల్దార్ వి.జితేంద్రతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ సకాలంలో నిర్ణీత సమయానికి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎండీయూ వాహన ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియపై తహసీల్దార్, ఎంఎస్ఓలకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆర్డీఓ ఆదేశించారు. అనంతరం సాంకేతికంగా తలెత్తుతున్న ఇబ్బందులను నివృత్తి చేసుకుంటూ రేషన్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని ఆర్డీఓ అన్నారు. ఆయన వెంట ఎంఎస్ఓ విజయ కుమారి, వీఆర్ఓ సుజాత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సెప్టిక్ ట్యాంకు వాహనం ప్రారంభం



సెప్టిక్ ట్యాంకు వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 21వ వార్డు కౌన్సిలర్ కావాడి పోసయ్యకి మంజూరైన సెప్టిక్ ట్యాంకు వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన వాహనాలు, పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ బాలిపల్లి రాంబాబు, పాదగయ దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, శ్రీపాద వల్లభ దేవస్థానం చైర్మన్ రెడ్డెం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఆలయ ఈవో బి.శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి వి.ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. గతేడాది నవంబర్ 25 నుంచి జనవరి 6 వరకూ హుండీల ద్వారా రూ.16,73,265 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం చైర్మన్ రెడ్డెం జనార్దన్, పాలకవర్గం సభ్యులు పైడా శ్రీరామమూర్తి, చక్కా దత్తచలపతి, నల్లాడ సూర్య ప్రసాద్, మీసాల విజయలక్ష్మి, జి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.